మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## జగదేవ్‌పూర్ మండలంలో కొనసాగుతున్న ఏకగ్రీవాల పర్వం

**జగదేవ్‌పూర్, నవంబరు 27 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పలు గ్రామపంచాయతీలను ఏకగ్రీవంగా ఎన్నుకునే దిశగా వివిధ గ్రామపంచాయతీ పెద్దలు పావులు కదుపుతున్నారు. మండలంలోని బిజివెంకటాపూర్, పలుగుగడ్డ, మాందాపూర్ గ్రామాలలో ప్రజలందరూ ఏకగ్రీవంగా తమ గ్రామపంచాయతీ సర్పంచ్‌లను ఏకగ్రీవం చేసేందుకు అంగీకారం తెలిపారు. అదేవిధంగా మండలంలోని కొండాపూర్, రాంనగర్, తీగుల్‌నర్సాపూర్, అంతాయగూడ, నిర్మల్‌నగర్, అనంతసాగర్, కొత్తపేట గ్రామపంచాయతీలలో కూడా సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవం వేసే దిశగా ఆయా గ్రామాల పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఏదిఏమైనా మండలంలోని చిన్న గ్రామపంచాయతీలు అన్నీ తమ గ్రామాల అభివృద్ధియే లక్ష్యంగా పోటీలో ఉండి ఎక్కువ మొత్తంలో డబ్బులు ఖర్చుపెట్టి నష్టపోకుండా గ్రామాభివృద్ధికి అందరు కలిసి ముందుకు తీసుకెళ్ళేందుకు కృషి చేస్తున్నారు.

## మొదటి రోజు 13 సర్పంచ్ నామినేషన్లు

**రాయపోల్ నవంబరు 27 (ప్రభాతవార్త) :** మండలంలో నామినేషన్ల స్వీకరణ గురువారం నామమాత్రంగా సాగింది. ఉదయం నుండే వివిధ క్లస్టర్లల్లో అభ్యర్థులు,అనుచరులు తరలివచ్చి సందడి వాతావరణాన్ని నెలకొల్పారు. అధికారుల పర్యవేక్షణలో పారదర్శకంగా నామినేషన్ల స్వీకరించగా రాయపోల్‌లో సర్పంచ్ అభ్యర్థిగా 1 నామినేషన్, లింగారెడ్డిపల్లి 2 నామినేషన్లు,1వార్డు సభ్యులు,అనాజీపూర్ క్లస్టర్‌లో అనాజీపూర్ 1,మంతూర్‌లో నుండి 3,అరేపల్లి 1,ఎల్కల్‌లో 2 సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులు 8,బేగంపేటలో 1,మండల వ్యాప్తంగా మొత్తం కలిపి 13 సర్పంచ్ నామినేషన్లు,11 వార్డు మెంబరు నామినేషన్లు స్వీకరించారు.మండలంలోని మంతూర్ గ్రామానికి చెందిన పాల రామగౌడ్ సుమారు 100 మంది అనుచరులతో తరలివచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా రామగౌడ్ మాట్లాడుతూ..గ్రామంలో సర్పంచ్‌గా గెలిచిన తరువాత గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తా,ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని,గ్రామ ప్రజలు తనని ఆదరించి తమ అమూల్యమైన ఓటును వేసి గ్రామ సర్పంచ్‌గా గెలిపించాలని అన్నారు



నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న భారతి లక్ష్మీనాయక్

## పారదర్శకంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తాం

### ఎన్నికల పరిశీలకురాలు భారతి లక్ష్మీనాయక్

**పాపన్నపేట, నవంబరు 27, ప్రభాతవార్త :** పారదర్శకంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల పరిశీలకురాలు భారతి లక్ష్మీ నాయక్ అన్నారు. గురువారం పాపన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆరు గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియను ఎన్నికల అబ్జర్వర్ భారతి లక్ష్మీనాయక్, మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, డిపిఓ యాదయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా భారతి లక్ష్మీనాయక్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించే క్రమంలో నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు, పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసే క్రమంలో కావలసిన ధృవపత్రాలను సమర్పించడంలాంటి విషయాలను అభ్యర్థులకు తెలియజేయాలని ఆమె సూచించారు. నామినేషన్ ఫారాలను స్పష్టంగా చూసి వాటిల్లో ఏవైనా తప్పులు ఉంటే సరిచేసేవిధంగా సహకరించాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల నిబంధన మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు, జిల్లాలో పకడ్బందీగా, పారదర్శకంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

## నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించాలి

### -రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ అనిత



నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ అనిత

**ములుగు, నవంబరు 27(ప్రభాతవార్త):** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారులు బాధ్యతగా వ్యవహరిస్తూ నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ అనిత పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని సింగన్నగూడ, చిన్నతిమ్మాపూర్ క్లస్టర్లలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నామినేషన్లు వేయడానికి వచ్చిన అభ్యర్థులతో మర్యాదగా ప్రవర్తిస్తూ నామినేషన్లు స్వీకరించాలని, ఎలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తగా నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మేరీ స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎన్నికల అధికారి



పాములపర్తిలో నామినేషన్ కేంద్రాన్ని తనిఖీచేస్తున్న జయదేవ్‌ఆర్య

**మర్కూక్, నవంబరు 27 (ప్రభాతవార్త):** రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు 2025 మొదటి విడత నామినేషన్ ప్రక్రియలో భాగంగా గురువారం పాములపర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి జయదేవ్ ఆర్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ఎన్నికల క్లస్టర్ అధికారులు సహకరించాలని సూచించారు. మండలంలోని 16 గ్రామపంచాయతీలకుగానూ 4 క్లస్టర్లలో ఆయా గ్రామాల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చుని పేర్కొన్నారు. ఆయనతోపాటు ఎంపిడివో విక్రమ్, ఎస్ఐ దామోదర్ ఉన్నారు.

## గుమ్మడిదల మండలంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

**గుమ్మడిదల నవంబరు 27 ప్రభాతవార్త :** మండలంలో ప్రారంభమైన ఎన్నికల సందడి గుమ్మడిదల ప్రజా పరిషత్ ఎన్నికల కార్యాలయాన్ని సంగారెడ్డి జిల్లా ఆర్డీవో రాజేంద్రకుమార్ తనిఖీ చేశారు. వీరి వెంట మండల తహసీల్దార్ పరమేశం ఉన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని నామినేషన్ వేసే సర్పంచి వార్డ్ మెంబర్ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, ఏదైనా బ్యాంకు నుంచి కొత్త అకౌంట్ నామినేషన్ పత్రంలో ఎలాంటి తప్పులు లేకుండా స్పష్టంగా అధికారికి అర్థమయ్యే విధంగా లిఖితపూర్వకంగా ఇవ్వాలని తెలిపారు. మొదటిరోజు నామినేషన్ పర్వం సందర్భంగా మంబాపూర్ గ్రామం నుంచి సర్పంచ్ అభ్యర్థిగా తలారి దయానందం, యంట నర్సింలు, నాగిరెడ్డిగూడెం నుండి వార్డు నంబర్ గడ్డం రాజేందర్‌రెడ్డి, అనంతరం గ్రామపంచాయతీ నుండి సర్పంచ్ అభ్యర్థులుగా రెండు ప్రభాకర్, కొమ్ము శ్రీను, నామినేషన్ దాఖలు చేసినట్లు ఎంపీడీవో ఉమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమం స్థానిక ఎస్సై లక్ష్మీకాంత్ రెడ్డి సిబ్బంది పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేంద్ర కుమార్

# నామినేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**అల్లాదుర్గం, నవంబరు 27, ప్రభాతవార్త:** పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని అభ్యర్థులు దాఖలుచేసే నామినేషన్‌ల ప్రక్రియను సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. గురువారం అల్లాదుర్గం, రేగోడ్, పెద్దశంకరంపేటలోని మండల పరిషత్ కార్యాలయాల్లో కొనసాగుతున్న నామినేషన్‌ల ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ మెదక్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్, హవేలిగణపూర్, పాపన్నపేట, శంకరంపేట(ఆర్) మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించి బాధ్యులకు పలు సూచనలు చేశారు. హెల్ప్‌డెస్క్, వీడియోగ్రఫీ, పోలీసు బందోబస్తు తదితర అంశాలను పరిశీలిస్తూ సపోర్టింగ్ స్టాఫ్ సరిపడాఉన్నారా లేదా అని ఆరా తీశారు. నోటీసు బోర్డుపై నోటిఫికేషన్ పత్రాలను ప్రదర్శించారా లేదా అని తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా నామినేషన్‌లను స్వీకరించాలన్నారు. నామినేషన్ దరఖాస్తు పత్రాలు తీసుకున్నవారి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్‌లను ఏ రోజుకు ఆ రోజే నోటీసు బోర్డుపై ప్రదర్శిస్తూ జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపాలని తెలిపారు. ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేశామని, నామినేషన్ పత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ ప్రశాంత వాతావరణలో ఎన్నికలు ముగిసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి ఏదేని అనుమానం, సందేహాలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసకెళ్లి నివృతి చేసుకోవాలన్నారు.



అల్లాదుర్గంలో ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

# సిద్దిపేట జిల్లా గజ్వేల్ డివిజన్‌లో ప్రారంభమైన తొలి విడత

### మొదటి రోజు సర్పంచ్ స్థానానికి 131, వార్డులకు 75 నామినేషన్ల దాఖలు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో మొదట విడతలో నిర్వహించే గజ్వేల్ డివిజన్ పరిధిలోని గ్రామపంచాయతీల సర్పంచ్, వార్డుసభ్యులకు గురువారం నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. డివిజన్‌లోని ఆయా గ్రామాలను 41 క్లస్టర్లుగా విభజించి క్లస్టర్ కేంద్రాలలో ఎన్నికల అధికారులు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. గజ్వేల్ డివిజన్ పరిధిలోని దౌల్తాబాద్, గజ్వేల్, జగదేవపూర్, మర్కూక్, ములుగు, రాయపోల్, వర్గల్ మండలాల్లోని 163 గ్రామ పంచాయతీలు, 1432 వార్డులకు నామినేషన్ల స్వీకరణ పర్వం ప్రారంభమైంది. దౌల్తాబాద్‌లో 25 గ్రామ పంచాయతీలు, 214వార్డులు, గజ్వేల్‌లో 25 గ్రామ పంచాయతీలు, 230 వార్డులు, జగదేవాపూర్ 25 గ్రామ పంచాయతీలు 222 వార్డులు, మర్కూక్ 16 గ్రామ పంచాయతీలు 140 వార్డులు, ములుగు 26 గ్రామ పంచాయతీలు 222 వార్డులు, రాయపోల్ 19 గ్రామ పంచాయతీలు 166 వార్డులు, వర్గల్ 27 గ్రామ పంచాయతీలు 238 వార్డులకు నామినేషన్లు స్వీకరిస్తున్నారు. ఆయా గ్రామాల పరిధిలో ఆశావహులు మొదటి రోజు నామినేషన్లు దఖాలు చేశారు. దౌల్తాబాద్ మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు 15 సర్పంచ్, 6 వార్డు సభ్యులకు నామినేషన్లు దాఖలు చేశారు. గజ్వేల్ 25 గ్రామ పంచాయతీలకు 34 సర్పంచ్ 4 వార్డు సభ్యులు నామినేషన్ దాఖలు చేశారు. జగదేవపూర్‌లో 25 గ్రామ పంచాయతీలకు 22 సర్పంచ్, 20 మంది వార్డులకు నామినేషన్లు వేశారు. మర్కూక్‌లో 16 గ్రామ పంచాయతీలలో 23 మంది సర్పంచ్,18 మంది వార్డు సభ్యులకు, ములుగు 26 గ్రామ పంచాయతీలకు 16 మంది సర్పంచ్‌లకు 11 మంది వార్డు సభ్యులకు,రాయపోల్ 19 గ్రామ పంచాయతీలకు 13 మంది సర్పంచ్‌లకు, 11 మంది వార్డు సభ్యులకు, వర్గల్‌లో 27 గ్రామ పంచాయతీలకు 8 మంది సర్పంచ్‌లకు, 5 మంది వార్డు సభ్యులకు నామినేషన్లు దాఖలు చేశారు. 7 మండలాలలో 163 గ్రామాలకు మొదటి రోజు 131 మంది సర్పంచ్ స్థానానికి, 1423 వార్డులకు 75 మంది వార్డు సభ్యులకు నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 29 వరకు నామినేషన్లను స్వీకరించానున్నారు. డిసెంబరు 3న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పంచాయతీ పోరులో ఉండే అభ్యర్థుల పేర్లు, గుర్తులను కేటాయిస్తారు. కాగా జిల్లా కలెక్టర్ కె.హైమావతి దౌల్తాబాద్, గజ్వేల్, రాయపోల్, జగదేవపూర్ మండలాల్లో పర్యటించిన నామినేషన్ల స్వీకరణ తీరును పరిశీలించారు.




నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

# కెసిఆర్ దీక్ష..అమరుల త్యాగ ఫలితమే నేటి తెలంగాణ రాష్ట్రం

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** కెసిఆర్ దీక్ష..అమరుల త్యాగఫలితమే నేటి ఈ తెలంగాణ రాష్ట్రమని... నవంబరు 29 లేకపోతే డిసెంబరు 9 లేదు.. డిసెంబరు 9 లేకపోతే జూన్ 2 లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని పొన్నాల శివారులోగల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2009 నవంబరు 29న చారిత్రాత్మక రోజు అన్నారు. తెలంగాణ సాధన కోసం సిద్దిపేటలో 1531 రోజులు దీక్ష శిబిరం నిర్వహించడం జరిగిందని గుర్తు చేశారు. ఉద్యమ జ్ఞాపకాల కోసం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయం ఎదుట పైలాన్ ఏర్పాటుచేయడం జరుగుతుందని చెప్పారు. తెలంగాణ సాధించడంతోనే సిద్దిపేటజిల్లా ఏర్పాటు చేసుకున్నాం..గోదావరి జలాలు, రైలు, మెడికల్ కాలేజీ తెచ్చుకున్నామని గుర్తుచేశారు. దేశానికి అన్నంపెట్టే ధాన్యాగారంగా తెలంగాణ మారిందన్నారు. కెసిఆర్ రాష్ట్రాన్ని సాధించి 10 యేండ్లు పరిపాలించి ఎంతో అభివృద్ధి చేశాడని తెలిపారు. జూన్ 2 లేకపోతే తెలంగాణ లేదు తెలంగాణ లేకపోతే రేవంత్‌రెడ్డికి సిఎం పదవి ఎక్కడదని ప్రశ్నించారు. అబద్దాలు, మాయమాటలు చెప్పి రేవంత్‌రెడ్డి గద్దెనెక్కిండన్నారు. రేవంత్‌రెడ్డికి ఎంతసేపు ఓట్ల రాజకీయ తప్ప రాష్ట్రం మీద ప్రజల మీద శ్రద్దలేదన్నారు. 42 శాతం రిజర్వేషన్లని బీసీలను మోసం చేశారని తెలిపారు. ఈనెల 29న సిద్దిపేట రూరల్ పోలీసుస్టేషన్‌వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి దీక్షాదివస్‌ను ప్రారంభించడం జరుగుతుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో నాటి జ్ఞాపకాలు అనుభూతులు పోరాట సన్నివేశాలను గుర్తు చేస్తూ తెలంగాణ ఉద్యమంలో నేను అనే ట్యాగ్‌లైన్‌తో నాటి ఫొటోలను సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో షేర్ చేయాలన్నారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శ్రీనివాస్, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ మాట్లాడారు. బిఆర్ఎస్ నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి, కొండం సంపత్‌రెడ్డి, రాజనర్సు,మచ్చ వేణుగోపాల్‌రెడ్డి.గుండు భూపేష్, రాధాకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న హరీష్‌రావు

# టేక్మాల్ మండలంలో ఏకగ్రీవాలు ఉండేనా ?

### గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు అందని నజరానా ..!

**టేక్మాల్, నవంబరు 27 ప్రభాతవార్త:** ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే నామినేషన్ల స్వీకరిస్తుంది.పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. దీంతో పల్లెల్లో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులను ఖరారు చేసేందుకు రాజకీయ పార్టీలు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎన్ని పంచాయతీలు ఏకగ్రీవంగా సర్పంచ్‌లను ఎన్నుకుంటాయనే చర్చ ప్రారంభమైంది. ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10లక్షలు సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామపంచాయతీలకు ప్రోత్సాహకంగా పది లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనికి స్పందన ఏ మేరకు ఉంటుందన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఎలాంటి ఘర్షణలు, వివాదాలు లేకుండా ప్రజలంతా ఐక్యంగా ఉండి ప్రశాంత వాతావరణంలో పాలకవర్గాలను ఎన్నుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నజరానాను ప్రకటించింది.

**గతంలో ఏకగ్రీవ పంచాయతీలు...**

కాగా గతంలో టేక్మాల్ మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండల పరిధిలోని 1) చంద్రుతండా, 2)హసన్ మహ్మద్‌పల్లి, 3)సంగ్యా తండా, 4)మల్కాపూర్, 5)చెరువుముందరి తండా పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు ఎలాంటి నజరాన రాలేదని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ప్రోత్సాహకం ఇవ్వలేదు. మాజీ సర్పంచ్‌లు 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీలను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామాభివృద్ధికి రూ. 10 లక్షలు ప్రోత్సాహక నిధులు ఇస్తామని చెప్పింది. గ్రామాన్ని అభివృద్ధి చేసుకోలేకపోయాం. ప్రస్తుత ప్రభుత్వం ఇస్తుందని నమ్ముతున్నాం. గ్రామ పంచాయతి కార్యాలయం ఎన్నికల్లో పోటీపడి డబ్బు ఖర్చు పెట్టి గెలిచినా, ఓడినా ఆర్థికంగా నష్టపోవడం తప్ప సాధించేది ఏమీ ఉండదని, ఏకగ్రీవం చేసుకుంటే అభ్యర్థులకు ఖర్చు తప్పడంతోపాటు గ్రామాభివృద్ధికి సర్పంచ్‌గా ఎన్నికయ్యే వ్యక్తి కొంత డబ్బు ఇస్తారని, దానికి తోడు ప్రభుత్వం ఇచ్చే రూ.10లక్షలతో అభివృద్ధి చేసుకోవచ్చని కొందరు ఆలోచన చేస్తున్నారు. ఒక పార్టీ బలంగాఉండి, మిగతా పార్టీలు బలహీనంగా ఉన్నచోట ఈ ప్రయత్నాలు అధికంగా జరుగుతున్నాయి.గతంలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10లక్షలు ఇస్తామని ప్రకటించింది.నాడు ఏకగ్రీవంగా ఎనుకున్న పంచాయతీలకు అటు ప్రభుత్వంగానీ, ఇటు ప్రజాప్రతినిధులుగానీ నిధులు ఇవ్వలేదు. దీంతో పంచాయతీలు ఏకగ్రీవం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వమైనా నజరాన ఇస్తుందా లేదా అనే ప్రశ్నించుకుంటున్నారు.





సర్పంచ్‌కు నామినేషన్ వేస్తున్న దృశ్యం

## మొదటి రోజు మందకొడిగా నామినేషన్లు

### ఒకటీ రాని వార్డు మెంబర్ల నామినేషన్లు

**సదాశివపేట, నవంబరు 27 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జరుగుతాయో లేదో అన్న అనుమానాన్ని పారద్రోలి గురువారం మొదటి విడత నామినేషన్ల పర్వం రాష్ట్రమంతట మొదలైంది. సదాశివపేట మండలంలోని 30 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు 272 వార్డు మెంబర్లకు మొదటి విడత నామినేషన్లు గురువారం నుండి నిర్దేశించిన పంచాయతీలలో అధికారులు స్వీకరించారు. తొలిరోజు వార్డు మెంబర్లకు ఒక్క నామినేషన్ కూడా రాలేదు. కంబాలపల్లి మద్దికుంట పరిధిలోని పంచాయతీలలో ఒక నామినేషన్ దాఖలుకాలేదు. పెద్దాపూర్ పరిధిలో గొల్లగూడెం నుండి ఒకరు పెద్దాపూర్ నుండి ఒకరు సర్పంచ్ పదవికి నామినేషన్ వేశారు. అలాగే వెల్టూర్ పరిధిలో ముబారక్‌పూర్ నుండి ముగ్గురు, వెంకటాపూర్ పరిధిలో మె లిగిరిపేట నుండి ఒకరు, ఇస్తిదాబాద్ నుండి ఒకరు, నిజాంపూర్ నుండి ఇద్దరు, వెంకటాపూర్ నుండి ఒకరు, సర్పంచ్ పదవికి నామినేషన్ వేశారు. నాగులపల్లి నుండి ఒకరు మెలిగిరిపేట నుండి ఒకరు, చందాపూర్ నుండి ఇద్దరు, అంకెనపల్లి నుండి ఒకరు,కోనాపూర్ నుండి ఇద్దరు,మొత్తం ఏడుగురు సర్పంచ్ పదవికి పరిధిలో నామినేషన్ వేశారు. ఆత్మకూర్ పరిధిలో సర్పంచ్ అభ్యర్థులుగా ఆత్మకూరు నుండి ఒకరు, ఎల్లారం నుండి ఒకరు, బాబిల్‌గం నుండి ఒకరు, మాలపాడు నుండి ఒకరు, ఏటిగడ్డ సంగం నుండి ఒకరు నామినేషన్ వేశారు. పెద్దాపూర్ పరిధిలో సమయానికి రెండు నామినేషన్లు సర్పంచ్ అభ్యర్థులకు దాఖలు కాగా అప్పటికే లోపల ఉన్న అభ్యర్థులు ఇంకా నామినేషన్ వేయుచున్నారని సంబంధిత అధికారులు తెలిపారు. పెద్దపూర్ పరిధిలో సర్పవచు అబ్యర్థులకు నాలుగు నామినేషన్లు దాఖలు కాగా వార్డు మెంబర్లకు 8 నామినేషన్లు వచ్చినట్టు అధికారులు తెలిపారు.నందికంది నుండి సర్పంచి అభ్యర్థికి ఒకరు,వార్డు మెంబరుకు ఒకరు,గొల్లగూడెం నుండి సర్పంచు అభ్యర్థికి ఇద్దరు, వార్డు మెంబరుకు నలుగురునామినేషన్ వేసినట్టు అధికారులు తెలిపారు.

### మొదటి రోజు ప్రశాంతంగా ముగిసిన నామినేషన్ల పర్వం

**పటాన్‌చెరు, నవంబరు 27, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ రెండవ సాధారణ ఎన్నికల పర్వం ప్రారంభమైంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలో నామినేషన్ల పర్వం మొదటిరోజు ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని భానురు, క్యాసారం, నందిగామ గ్రామాలకు చెందిన పోటీదారులు ఎన్నికల అధికారులకు నామినేషనపత్రాలు అందించారు. తమను బలపరిచే పార్టీ నాయకులు మద్దతుదారులతోకలిసి నామినేషన్ పత్రాలను దాఖలు చేసేందుకు కేటాయించిన కేంద్రాలకు తరలివచ్చి నామినేషన్లు వేశారు. నామినేషన్ల ప్రక్రియ మండల ప్రత్యేక అధికారి ఐనీష్, జిల్లా సహాయ ఎన్నికల అధికారి, ఎంపిడిఓ యాదగిరి, ఎంపీఓ హరి శంకర్‌గౌడ్ పర్యవేక్షణలో జరిగింది. భానురు రిటర్నింగ్ అధికారి డాక్టర్ యోగిబాబుకు సర్పంచ్ అభ్యర్థి 1, వార్డ్ మెంబర్ అభ్యర్థులు నలుగురు నామినేషన్లు దాఖలుచేశారు. క్యాసారం గ్రామానికి సంబంధించిన సర్పంచ్ నామినేషన్ అభ్యర్థులు 1, వార్డు నామినేషన్లు ముగ్గురు దాఖలు చేశారు. నందిగామ సర్పంచ్ నామినేషన్లు సర్పంచ్ అభ్యర్థులు 4, వార్డు మెంబర్లు నామినేషన్ల సంఖ్య 10 సమర్పించినట్టు తెలిపారు. మూడు గ్రామపంచాయతీలకు సంబంధించిన నామినేషన్లు మొత్తం సర్పంచ్ అభ్యర్థులు 6, వార్డు మెంబర్లు 17 నామమేషన్లు ఎన్నికల అధికారి స్వీకరించినట్టు తెలిపారు. ఎన్నికల బందోబస్తులో పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, భానూరు సీఐ వినయ్‌కృష్ణ, ఎస్సైలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## హీరాలాల్ షెడ్డుపై దాడి చేసిన స్పెషల్ పోలీసులు

### పేకాట ఆడుతున్నారని సమాచారం.. పట్టుకునేందుకు వెళ్లామన్న పోలీసులు

**పాపన్నపేట, నవంబరు 27, ప్రభాతవార్త :** హీరాలాల్ షెడ్డులో 'రివాల్వర్ చూపించి రూ. 2.5 లక్షల దోపిడీ' శీర్షికన వచ్చిన కథనానికి పోలీసులు స్పందించారు. ఏడుపాయలక్షేత్రంలోని సత్రాలలో అసాంఘిక కార్యకలాపాలు, జూదం ఆటలను అరికట్టాలని మంగళవారం రాత్రి స్పెషల్ పోలీసులు గస్తీ చేపడుతున్న క్రమంలో హీరాలాల్ షెడ్డులో కొందరు పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు మెదక్ స్పెషల్ పోలీసులు దాడిచేయగా, పేకాట రాయుళ్ల పోలీసులపై దాడిచేసేందుకు యత్నించగా అనుకోని సంఘటనను గుర్తించిన పోలీసు ఉన్నతాధికారి రివాల్వర్ చూపించడంతో బయపడిన పేకాట రాయుళ్ల వెనుకంజ వేయడంతో, కుటుంబీకులు తాము విందులో పాల్గొనేందుకు వచ్చామని, తమ కుటుంబ సభ్యులను వదిలి పెట్టాలని వేడుకోవడంతో పోలీసులు మానవత దృక్పథంతో వదిలి పెట్టినట్లు ఉన్నతాధికారి పేర్కొన్నారు. ఈ విషయమై రివాల్వర్‌తో దోపిడీ దొంగలు అని బుధవారం వివిధ వెబ్‌సైట్‌లలో ప్రచారం కావడంతోపాటు వివిధ పత్రికలలో వచ్చిన కథనానికి పోలీసులు స్పందించారు. పోలీసు ఉన్నతాధికారి మానవత దృక్పథంతో మహిళల కోరిక మేరకు పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేయకుండా వదిలి పెడితే... మాపై మెదక్ పట్టణానికి చెందిన రాజు డబ్బులు తీసుకున్నామని ఆరోపణలు చేయడం విస్మయానికి గురిచేసిందని అధికారి పేర్కొన్నారు. హీరాలాల్ షెడ్డుపై దాడులు జరిపింది ఆయుధాలు కలిగిన దుండగులు కాదని... అసాంఘిక కార్యక్రమాలు అరికట్టే స్పెషల్ పోలీసు బృందం అని తెలిపారు.

## అక్రమ మద్యం పట్టివేత

**చిలిపిచెడ్, నవంబరు 27 ప్రభాతవార్త :** మండలంలోని పలు గ్రామాల్లో మద్యం దుకాణాలపై స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గంగారం గ్రామంలోని మంగలి శ్రీకాంత్ షాపులు 3.28 లీటర్లు, ఫైజాబాద్‌లోని రామస్వామి, సుధాకర్‌గౌడ్ 23.4 లీటర్లు, అదే గ్రామంలో రామస్వామి, అశోక్‌గౌడ్ హోటల్లో 4.74 లీటర్ల మద్యం సీసాలను స్వాధీనపరచుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ మద్యం విలువ ఒండు లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఎన్నికల నిబంధనలు అమల్లో ఉండగా అక్రమ కార్యకలాపాలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## కిరాణా కొట్టులో మద్యం బాటిళ్లు స్వాధీనం

**న్యాల్‌కల్, నవంబరు 27, ప్రభాతవార్త:** కిరాణా కొట్టులో అక్రమంగా అమ్మకానికి సిద్దంగా ఉంచిన మద్యం బాటిళ్లను గురువారం హద్నూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ దోమ సుజిత్ కథనం ప్రకారం... మండల పరిధిలోని మిర్జాపూర్ గ్రామంలో తెలుగు అంజన్న కిరాణా కొట్టులో మద్యం అమ్మకాలు జరుపుతున్నట్లు విశ్వసనీయంగా తెలుసుకున్న ఎస్ఐ దోమ సుజిత్ సిబ్బందితో తనిఖీ చేయగా అమ్మకానికి సిద్దంగా ఉంచిన ఇంపీరియల్ బ్లూ 4 బాటిళ్లు, ఆఫీసర్ చాయిస్ 8 బాటిళ్లు, డీకే బాటిల్‌లు 8 బాటిళ్ల(మొత్తం 20 బాటిళ్ల)ను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ దోమ సుజిత్ పేర్కొన్నారు. అంజన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దోమ సుజిత్ వివరించారు.


మాట్లాడుతున్న గడిపె మల్లేశ్

## స్థానిక ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించాలి

### సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 27, ప్రభాతవార్త :** వచ్చే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో ప్రజలు సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా సహాయకార్యదర్శి గడిపె మల్లేశ్ పిలుపునిచ్చారు. గురువారం మహ్మదపూర్, నాగారం, పోతారం(ఎస్) మీర్జాపూర్, జిల్లెల్లగడ్డ, పందిల్ల, బంజెరుపల్లె, గ్రామనాయకులు కార్యకర్తలతో కలిసి వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసేందుకు సిద్ధమైనట్లు వివరించారు. సిపిఐ అభ్యర్థుల గెలుపునకు నాయకులు కార్యకర్తలు, కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల బాధ్యులు జనగాం రాజ్‌కుమార్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి కుమారస్వామి, నాయకులు మల్లారెడ్డి, పిట్టల ప్రసాద్, మల్లయ్య, మాజీ ఎంపిటిసి సభ్యులు సుధాకర్, సిపిఐ గ్రామ కార్యదర్శులు మొగిలయ్య, కిష్టయ్య, విజయ, రమేష్, కొమురయ్య, రఘుపతి, సమ్మయ్య పాల్గొన్నారు.

## 3న హుస్నాబాద్‌లో సిఎం పర్యటన


పనులు పరిశీలిస్తున్న లింగమూర్తి

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 27, ప్రభాతవార్త :** డిసెంబరు 3వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హుస్నాబాద్ పర్యటించనున్న నేపథ్యంలో గ్రౌండ్ పనులతోపాటు హెలిప్యాడ్ ల్యాండింగ్ ప్రదేశాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 3వ తేదీన హుస్నాబాద్‌లో పర్యటించే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. పరిశీలించినవారిలో కాంగ్రెస్ నాయకులు వల్లపు రాజు, గంపల శ్రీనివాస్, లావుడియా బిక్య నాయక్ తదితరులు ఉన్నారు.

## జాతీయ స్థాయి పోటీకి ఎంపికైన విద్యార్థికి సత్కారం


విద్యార్థిని సత్కరిస్తున్న బిజెపి నాయకులు

**హుస్నాబాద్ టౌన్, నవంబరు 27, ప్రభాతవార్త :** పట్టణానికి చెందిన పచ్చిమట్ల శ్రీనివాస్ కూతురు పచ్చిమట్ల రవళి ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలో మూడవ స్థానంలో నిలిచి, జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన సందర్భంగా గురువారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థి రవళిని శాలువాతో సత్కారించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వచ్చే నెలలో జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలు ఒడిసా రాష్ట్రంలో జరుగుతున్న సందర్భంగా అక్కడికి వెళ్లాడానికి రవాణా ఖర్చులకు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హుస్నాబాద్ పట్టణ ఉపాధ్యక్షులు బోడిగే వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పోలోజు రాజేందర్‌చారి, బీజేపీ సీనియర్ నాయకులు వేముల దేవేందర్‌రెడ్డి, వరియోగుల అనంతస్వామి, వెల్దండి సంతోష్ ,ఆశాడపు శ్రీనివాస్, వార్డు ప్రజలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి : బిఆర్ఎస్


మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేతలు

**కొమురవెల్లి, నవంబరు 27, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ సర్కారు హయాంలో జరిగిన అభివృద్ధిని గడపగడపకు తీసెకెళ్లి వివరించాలని ఆ పార్టీ నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గీస బిక్షపతి, మాజీ జడ్పిటిసి సిలివేరు సిద్దప్ప, మాజీ వైస్‌ప్రెసిడెంట్ కాయిత రాజేందర్‌రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో క్లస్టర్ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో కార్యకర్తల సన్నాహక సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటీ వరకు చేస్తున్నా మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకుసాగాలన్నారు. సమావేశాలలో నాయకులు తాలారి కిషన్, తాడెం రంజిత కృష్ణమూర్తి, ఎర్రోళ్ల రామచంద్రం, యాట యాదగిరి, ఎర్రుల మహేష్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## కోకో క్రీడల సంబరానికి సిద్ధమైన పటాన్‌చెరు

### నేటి నుంచి బాల బాలికలకు అండర్ 14 కోకో పోటీలు

**పటాన్‌చెరు, నవంబరు 27, ప్రభాతవార్త :** రాష్ట్రస్థాయి క్రీడలకు పటాన్ చెరు మరోసారి వేదికగా నిలవనుంది. పటాన్‌చెరు డివిజన్‌పరిధిలోని మైత్రి మైదానం వేదికగా నేటి నుండి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు 44వ తెలంగాణ అండర్ 14 ఖోఖో బాల-బాలికల అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్-2025 పోటీలు జరగనున్నాయి. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సౌజన్యంతో ఖోఖో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో క్రీడపోటీలు జరగనున్నాయి. గురువారం ఉదయం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మైత్రి మైదానంలో క్రీడల ఏర్పాట్లను పరిశీలించారు. 33 జిల్లాల నుండి తరలి వచ్చే క్రీడాకారులకు ఇబ్బందులు తలెత్తకుండా వసతి సదుపాయంతో పాటు అల్పాహారం, భోజనం సదుపాయాలను సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఏడాది పొడుపున వివిధక్రీడల్లో రాష్ట్ర, జాతీయ పోటీలకు పటాన్‌చెరు మైత్రి మైదానాన్ని వేదికగా నిలుపుతున్నామని తెలిపారు. కోకో క్రీడకు మరింత ప్రాచుర్యం అందించేలా రాష్ట్రస్థాయి పోటీలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో కోకో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు హరికిషన్, కార్యదర్శి శ్రీకాంత్, పటాన్ చెరు సీఐ వినాయకరెడ్డి, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్‌రెడ్డి,పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

# అధికారులు నామినేషన్ ప్రక్రియను సజావుగా జరపాలి

* అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు
* సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**గజ్వేల్, నవంబరు 27 (ప్రభాతవార్త):** రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు 2025 మొదటి విడత నామినేషన్ ప్రక్రియలో భాగంగా గజ్వేల్, జగదేవ్‌పూర్ మండలాల్లోని అక్కారం, జగదేవ్‌పూర్, గొల్లపల్లి క్లస్టర్లను గురువారం జిల్లా కలెక్టర్ కె.హైమావతి నామినేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గజ్వేల్ మండల పరిధిలోని అక్కారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన నామినేషన్ ప్రక్రియను పరిశీలించగా అక్కారం, శ్రీగిరిపల్లి, దాతర్‌పల్లి గ్రామాలకు చెందిన అభ్యర్థుల నుండి నామినేషన్లను స్వీకరిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. అలాగే జగదేవ్‌పూర్ గ్రామపంచాయతీలో పీర్లపల్లి, ధర్మారం, గొల్లపల్లి, కొండాపూర్, దౌలాపూర్, జగదేవ్‌పూర్ గ్రామాల అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ రాష్ట్ర


గొల్లపల్లి గ్రామపంచాయతీలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం గ్రామపంచాయతీ ఎన్నికలకు ఈనెల 25న షెడ్యూల్ ప్రకటన చేసిందని, జిల్లాలో మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతాయని, మొదటి విడతలో దౌల్తాబాద్, రాయపోల్, మర్కుక్, ములుగు, గజ్వేల్, జగదేవ్‌పూర్, వర్గల్ మండలాల్లో మొత్తం 163 గ్రామపంచాయతీలు, 1432 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 44 క్లస్టర్లలో నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందన్నారు. స్టేజి-1, స్టేజి-2 అధికారులను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందని, నామినేషన్లను ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించడం జరుగుతుందన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు మరో ఇద్దరిని లోపలికి ఇవ్వాలని, మూడు రోజుల పాటు మొదటి నామినేషన్ స్వీకరించడం జరుగుతుందని, నామినేషన్ ప్రక్రియకు ఆయా మండలాల ఎంపిడివోలు, సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం క్లుప్తంగా తనిఖీ చేసిన తర్వాతే స్లిప్‌లు అందజేయాలని, స్టేజ్ 1,2 ఆర్‌వోలను ఆదేశించారు. నామినేషన్ అభ్యర్థులకు సహాయం కోసం అన్ని క్లస్టర్లలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. క్లస్టర్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో మార్కింగ్ చేసి ముగ్గురిని మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతించాలని క్లస్టర్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు గట్టి బందోబస్తు నిర్వహించాలని తెలిపారు. కలెక్టర్ వెంట ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపిడివోలు, అధికారులు ఉన్నారు.

# మొదటి రోజు దాఖలైన నామినేషన్ల వివరాలు

**గజ్వేల్, నవంబరు 27 (ప్రభాతవార్త):** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా గురువారం మొదటి విడత నామినేషన్ల ప్రక్రియలో భాగంగా గజ్వేల్ మండల పరిధిలోని 25 గ్రామపంచాయతీలకు 34 మంది సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేయగా 230 మంది వార్డు సభ్యులుగా నామినేషన్లను దాఖలు చేసినట్లు స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు.

**ములుగు మండలంలో...**

**ములుగు, నవంబరు 27 (ప్రభాతవార్త):** మండలంలో మొత్తం 26 గ్రామపంచాయతీలకు గానూ 7 క్లస్టర్లను ఏర్పాటు చేయగా గురువారం మొదటి రోజు సర్పంచ్ అభ్యర్థులుగా 16 మంది, వార్డు మెంబర్ అభ్యర్థులుగా 11 మంది నామినేషన్లు దాఖలు చేశారు. సింగన్నగూడ క్లస్టర్‌లో కొక్కొండ గ్రామపంచాయతీకి 2 సర్పంచ్, 5 వార్డులకు, సింగన్నగూడ పంచాయతీలో 2 సర్పంచ్, 6 వార్డులకు, కొత్తూరు క్లస్టర్‌లో బస్వాపూర్ గ్రామ పంచాయతీకి 1 సర్పంచ్‌కు, కొత్తూరు గ్రామ పంచాయతీలో 3 సర్పంచ్‌కు, క్షీరసాగర్ క్లస్టర్‌లో గంగధార్‌పల్లి 1 సర్పంచ్‌కు, క్షీరసాగర్ 2 సర్పంచ్‌కు, నర్సంపల్లి క్లస్టర్‌లో కొట్యాల 2 సర్పంచ్‌కు, నర్సంపల్లి 1 సర్పంచ్‌కు, చిన్నతిమ్మాపూర్ క్లస్టర్‌లో తునికిబొల్లారం 1 సర్పంచ్‌కు, చిన్నతిమ్మాపూర్ 1 సర్పంచ్‌కు నామినేషన్లు దాఖలు అయ్యాయని


చిన్నతిమ్మాపూర్‌లో నామినేషన్‌స్వీకరిస్తున్న అధికారులు


చేబర్తిలో నామినేషన్‌ను స్వీకరిస్తున్న అధికారులు

ఆయా క్లస్టర్ల అధికారులు తెలిపారు.

**మర్కుక్ మండలంలో...**

**మర్కుక్, నవంబరు 27 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని 16 గ్రామపంచాయతీలకు గానూ 4 క్లస్టర్లను ఏర్పాటు చేయగా గురువారం మొదటి రోజు నామమాత్రంగా నామినేషన్లు దాఖలయ్యాయి. మర్కుక్ క్లస్టర్‌లో చేబర్తి గ్రామపంచాయతీకి సర్పంచ్ 1, పాములపర్తి క్లస్టర్‌లో పాములపర్తి వార్డు మెంబర్‌కు 1, పాతూర్ సర్పంచ్‌కు 3, ఇప్పలగూడెం సర్పంచ్‌కు 2, వార్డుమెంబర్‌కు 2, అంగడికిష్టాపూర్ సర్పంచ్ 3, వార్డు 3, ఎర్రవల్లి క్లస్టర్‌లో ఎర్రవల్లి సర్పంచ్ 2, వార్డు 8, నర్సన్నపేట సర్పంచ్ 1, వర్ధరాజ్‌పూర్ సర్పంచ్ 3, దామరకుంట క్లస్టర్‌లో దామరకుంట సర్పంచ్ 2, వార్డు 2, కర్కపట్ల సర్పంచ్ 2, వార్డు 1, కాశిరెడ్డిపల్లి సర్పంచ్ 3, వార్డు 1, పిఆర్‌వెంకటాపూర్ సర్పంచ్ 1 నామినేషన్లు దాఖలు అయ్యాయని మండల అభివృద్ధి అధికారి విక్రమ్ తెలిపారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

## 'పది'లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి, మున్సి పాలిటీ నవంబర్ 27 ప్రభాతవార్త :** కంది మండలం, చేర్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో జరుగుతున్న బోధనా పద్ధతులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులను సిలబస్ ఎంతవరకు పూర్తయింది, రెగ్యులర్, ప్రత్యేక తరగతులు ఎలా జరుగుతున్నాయి అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక తరగతులు బాగా నిర్వహిస్తున్నారని,చక్కగా చదువుకుంటున్నట్లు విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు. విద్యార్థులందరికీ ప్రతిరోజూ స్నాక్స్ అందుతున్నాయా, మిడ్‌డే మీల్ నాణ్యత ఎలా ఉంది, అనే విషయాలపై ఉపాధ్యాయులను కలెక్టర్ ఆరాతీసారు. పాఠశాల హాజరు శాతం, పదవ తరగతి విద్యార్థుల ప్రిపరేషన్, మాక్ టెస్టులు ఎంతవరకు నిర్వహిస్తున్నారన్న అంశాలను ప్రత్యేకంగా సమీక్షించారు. కలెక్టర్‌తో విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాకు విచ్చేసిన సాధారణ, వ్యయ పరిశీలకులు

**సంగారెడ్డి, మున్సి పాలిటీ, నవంబర్ 27, ప్రభాతవార్త:** జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణను పారదర్శకంగా, శాంతియుతంగా జరపడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఇద్దరు అధికారులను పరిశీలకులుగా నియమించింది. జిల్లాకు పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులుగా ఐఏఎస్ అధికారి ఉదయ్‌కుమార్‌ను, వ్యయ పరిశీలకులుగా జిల్లా ఆడిట్ ఆఫీసర్ రాకేష్‌లను నియమించింది. ఎన్నికలప్రక్రియలో సాధారణ పర్యవేక్షణ, అభ్యర్థుల ఖర్చుల పర్యవేక్షణ వంటి అంశాలను పరిశీలకులు పర్యవేక్షిస్తారు.వ్యయ పరిశీలకులు జి.రాకేష్ సంబంధిత అధికారులతో సమావేశమై ఎన్నికలలో అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి పైసా పై నిఘా ఉంచాలన్నారు. నిబంధనల మేరకు పారదర్శకంగా నడుచుకోవాలని ఆదేశించారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

### -సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**గజ్వేల్, నవంబరు 27 (ప్రభాతవార్త):** విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ఇలాగే ఉంటుందా అని సిద్దిపేట జిల్లాకలెక్టర్ కె.హైమావతి మధ్యాహ్న భోజన కార్మికులను, ప్రధానోపాధ్యాయునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గజ్వేల్ మండలంలోని అక్కారం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీచేసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వం ఇస్తున్న మెనూలో భాగంగా బగారా అన్నం, తోటకూర పప్పు వండినట్లు వంట సిబ్బంది తెలిపారు. కాగా అన్నాన్ని కలెక్టర్ పరిశీలించగా నాణ్యత సరిగ్గా లేనందున వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజు విద్యార్థులకు ఇలాగే పెడుతున్నారా, బగారా అన్నం ఎలా చేస్తారో తెలియదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు పౌష్టికాహారం అందించకుండా విధులు ఎలా నిర్వహిస్తున్నారని ప్రధానోపాధ్యాయున్ని, ఫుడ్ చెకింగ్ టీచర్‌పై మండిపడ్డారు. కామన్ డైట్ మెనూ పాటించాలని, రోజూ మధ్యాహ్న భోజన వంట ప్రక్రియను పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయున్ని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ఏ తరగతి, ఆహారం ఎలా ఉంది, నిన్న, నేడు ఏం తిన్నారు, రుచి ఎలా ఉండి అని తెలుసుకున్నారు. ఆహారం కడుపునిండా తినాలని, అప్పుడే శారీరకంగా బలంగా ఉంటారని పిల్లలకు సూచించారు. చదువు, ఆహారం విషయంలో ఎలాంటి లోటు లేకుండా చూసుకోవాలని ప్రధానోపాధ్యాయున్ని, ఉపాధ్యాయులను ఆదేశించారు.

# ఆరెకటికలు సమన్వయంతో పనిచేయాలి

### ఆరెకటికె రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ జమాల్‌పూర్ బాలరాజ్

**గజ్వేల్ టౌన్, నవంబరు 27 (ప్రభాతవార్త):** ఆరెకటికలు అందరూ ఒకే తాటిపై నిలబడి ఒకే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని ఆరెకటికె రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ జమాల్‌పూర్ బాలరాజ్ అన్నారు.గజ్వేల్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ఆరెకటిక సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆరెకటికలు అందరూ ఒకే రాష్ట్రం ఒకే ఆరెకటిక అధ్యక్షుడు అనే నినాదంతో బయలుదేరి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నామని, రాష్ట్ర అధ్యక్షుడిని ఎన్నుకోవడం గురించి ప్రతి మండలం నుంచి మూడు ఓట్లతో నియోజకవర్గం, జిల్లా అలాగే రాష్ట్ర స్థాయి వరకు అందరిని కలిసి చర్చించుకొని రాబోయే రోజుల్లో హైద్రాబాద్ మహానగరంలో పెద్దఎత్తున ఎన్నికలు నిర్వహించి ఆరెకటిక రాష్ట్ర అధ్యక్షున్ని ఎన్నుకుంటామని తెలిపారు. ఆరెకటికుల బంధువులను కలవడానికి ఎక్కడికి వెళ్ళినా మంచి స్పందన లభిస్తుందని అన్నారు. రాష్ట్రంలో ఆరెకటిక కులస్తుడు ఎవరైనా రాష్ట్ర అధ్యక్ష పోటీలో ఉండవచ్చుని, ఈ ఎన్నికలు పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఎన్నికలు విజయవంతం చేసి ఆరెకటిక ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. కళ్యాణ్‌కార్ నర్సింగరావు మాట్లాడుతూ ఆరెకటికల సామాజిక అంశాలను తెలుసుకోవడానికి ఒక రాష్ట్ర నాయకత్వం ఉండాలనే ఆలోచనతో సంఘ పెద్దలు తీసుకున్నట్లు నిర్ణయాన్ని మేము స్వాగతిస్తున్నామని, ఆరెకటికలకు సంబంధించిన అన్ని అంశాల మీద బిసి కమిషన్ వద్ద గానీ, మా సంబంధిత నాయకుల వద్ద గానీ మాట్లాడడానికి ఒక నాయకత్వం కావాలని, అలాంటి నాయకత్వాన్ని అందరూ కలిసి ఒకరిని ఎన్నుకొని ఏక నాయకత్వంలో మన సమస్యలను మీద ముందుకు వెళ్ళాలనే ఆలోచన మన సంఘ పెద్దల నిర్ణయం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆరెకటిక కమిటీ వైస్ చైర్మన్ నేతిక రవికుమార్, జనరల్ సెక్రటరీ దండోతికర్ జితేందర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మురళీధర్, కళ్యాణ్‌కార్‌కిషన్, జమాల్‌పూర్ శ్రీనివాస్, రమేష్, శివాజీ, విఠల్, యాదిలాల్, నందలాల్, రాజు, రామచంద్రం, అశోక్, పెద్ద లక్ష్మణ్, శ్రీనివాస్, బన్సిలాల్, నర్సోజి, కేశు, శంకర్, చిన్న లక్ష్మణ్, రమేష్, తుక్కోజి, రాజు, పవన్, సోనులాల్, నిఖిల్, చందులాల్, చిన్న శ్రీను, నాగరాజు, మహేష్, సందీప్, రాజేశ్వర్, సాయికుమార్ పాల్గొన్నారు.


జమాల్‌పూర్ బాలరాజ్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న దృశ్యం



ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

## బాలికల విద్య సామాజిక పురోగతికి పునాది

### మెదక్ జిల్లా ఎస్‌పి మహేందర్

**మెదక్ టౌన్, నవంబరు 27, ప్రభాతవార్త:** మెదక్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం బాల్యవివాహాల నిర్మూలనకు సంబంధించిన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి, బాల్యవివాహాలు సమాజ అభివృద్ధికి ఆటంకం కలిగించే ముఖ్య సమస్యగా గుర్తించిన నేపథ్యంలో, విద్యార్థినుల్లో చట్టపరమైన అవగాహన, స్వీయ రక్షణ, బాలల హక్కులపై అవగాహనా కల్పించడం కొరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బాలికల విద్య సామాజిక పురోగతికి పునాది అని, విద్య అమ్మాయిలకు శక్తి, ధైర్యం, సొంత నిర్ణయాలు తీసుకునే ఆత్మవిశ్వాసం కల్పిస్తుందని, బాల్యవివాహం అమ్మాయిల జీవితాన్ని, విద్య, ఆరోగ్యం, ఆర్థిక స్థిరత్వం వంటి అనేక విషయాల్లో వెనక్కు నెట్టే ప్రమాదకరమైన చట్ట వ్యతిరేక చర్య అని, అలాగే 18 సంవత్సరాలలోపు అమ్మాయిలకు వివాహం చేయడం బాల్యవివాహాల నిరోధక చట్టం-2006 ప్రకారం శిక్షార్హ నేరమని గుర్తు చేస్తూ, తల్లిదండ్రులు, బంధువులు, గ్రామ పెద్దలు లేదా ఇతరులు ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. సమాజంలో బాల్యవివాహాల నిర్మూలనకు విద్యార్థినుల పాత్ర ఎంతో ముఖ్యమని, వారు ఇతరులకు అవగాహన కల్పించే అంబాసిడర్లుగా మారాలన్నారు. బాల్యవివాహాలపై సమాచారం లభించినా వెంటనే 100 నెంబర్ లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని, బాలికల భవిష్యత్తు రక్షించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందనీ, సమాజం ఈ సమస్యను నిర్మూలించడంలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సిబ్బంది బాల్యవివాహాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక సమస్యలను వివరంగా విద్యార్థినులకు తెలియజేశారు. కార్యక్రమంలో డిఇఒ విజయ డివైఒ హేమ భార్గవి, ఎసై సుచిత, అధ్యాపకులు, షీటీం, సఖీ, సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో ఆంగ్ల భాషలో నైపుణ్యం పెంపొందించడమే ముఖ్య ఉద్దేశం : ఎంఇవో ఉదయభాస్కర్‌రెడ్డి



గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేసిన దృశ్యం

**ములుగు, నవంబరు 27 (ప్రభాతవార్త):** విద్యార్థులలో ఆంగ్ల భాషలో నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యంగా మండల స్థాయి ఇంగ్లీష్ ఒలంపియాడ్,ఎడ్యుక్వెస్ట్ నిర్వహించడం జరిగిందని మండల విద్యాధికారి ఉదయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ములుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని 8 ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ టాలెంట్ టెస్ట్, ఇంగ్లీష్ ఒలంపియాడ్, ఎడ్యుకేస్ట్ టాప్ పోటీలను మండల కో-ఆర్డినేటర్ జ్యోతి, ఆంగ్ల ఉపాధ్యాయుల సహకారంతో నిర్వహించగా జిల్లా పరిశీలకులుగా తిరుపతిరెడ్డి, న్యాయ నిర్ణేతలుగా శిరిన్, సద్గుణం వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెజీనా, జోషి, శ్రీనివాస్, జి.శ్రీనివాస్, వైకుంఠం, పద్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి దేహలత ములుగు, ద్వితీయ తేజశ్రీ క్షీరసాగర్, జూనియర్స్ విభాగంలో ప్రథమ ఋతురెడ్డి ములుగు, ద్వితీయ అక్షయ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, ఎడ్యుక్వెస్ట్ ఉపన్యాస సీనియర్స్‌పోటీలో ప్రథమ అర్చిత ములుగు, ద్వితీయ సిరి క్షీరసాగర్, జూనియర్స్‌లో నరపథమ శ్రావణి బండతిమ్మాపూర్, ద్వితీయ మణిరుత్తురెడ్డి ములుగు, రెసిడెన్షియల్ విభాగం ఒలంపియాడ్ సీనియర్స్ ప్రథమ జెస్సికా కెజిబివి ములుగు, ద్వితీయ చంద్రిక కెజిబివి ములుగు, ఎడ్యుక్వెస్ట్‌లో సీనియర్స్ పావని కెజిబివి ములుగు, జూనియర్స్‌లో సౌజన్య విజేతలుగా నిలిచారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మైత్రివారి సహకారంతో బహుమతులను అందజేశారు. విజేతలను ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి, లయన్స్ డిస్టిక్ గవర్నర్ అమర్నాథ్‌రావులు అభినందించారు.

**మిరుదొడ్డి జడ్పిహెచ్ఎస్‌లో...**

**మిరుదొడ్డి, నవంబరు 27,ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఇంగ్లీష్ ఒలంపేడేలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. అనంతరం ప్రతిభావంతులకు సర్టిఫికెట్లు అందజేశారు.మిరుదొడ్డి కాంప్లెక్స్ హెచ్ఎం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల ఆర్‌పి శ్రీనివాస్, శ్రీనివాసచారి, కవిత, సుమంత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు జిరాక్స్ మిషన్ అందజేత

**చేర్యాల, నవంబరు 27, ప్రభాతవార్త :** చేర్యాల పెద్దమ్మ గడ్డ ప్రాథమిక పాఠశాలకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు గుడ్ల బాబు మినీ జిరాక్స్ మిషన్ బహుకరించారు. గతంలో ఇదే పాఠశాలలో పనిచేసిన ఆయన ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసని, నిరుపేద కుటుంబంలో పుట్టిన తాను కష్టపడి చదువుకొని ఉపాధ్యాయుడు అయ్యానని గుర్తు చేశారు. తనలాగే అందరూ చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రాధాబాయి, ప్రధానోపాధ్యాయులు సురేష్‌బాబు, భాగ్యలక్ష్మి, మహేందర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నేతలు బి.రాజేందర్ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

**కొమురవెల్లి, నవంబరు 27, ప్రభాతవార్త :** గ్రామాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఐనాపూర్‌లో మాజీ సర్పంచ్ విజేందర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మహా పడిపూజలో ఆయన పాల్గొని పూర్ణాహుతి సమర్పించి అనంతరం మాట్లాడారు. భక్తి, సంస్కృతుల పరిరక్షణకు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గానికి సన్మానం

**సిద్దిపేట రూరల్, నవంబరు 27,ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్ ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని హరీష్‌రావు శాలువాలతో ఘనంగా సత్కారించి మాట్లాడారు. శివాజీనగర్ ఆర్యవైశ్య నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం నూతన అధ్యక్షులు కాచం కాశీనాథ్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను కార్యవర్గ సభ్యులతో కలిసి సంఘం అభివృద్ధికి ఎల్లవేళల పని చేస్తామన్నారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘం సభ్యులు, నూతన కార్యవర్గాన్ని సత్కారించి ఉత్సాహాన్ని నింపిన హరీష్‌రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తడకమడ్ల జనార్ధన్, కోశాధికారి మద్ది శంకర్, సంఘం సభ్యులు బెజుగామ వినయ్, గరిపల్లి శ్రీనివాస్, మురంశెట్టి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గాన్ని సత్కారిస్తున్న హరీష్‌రావు

## ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు




ప్రతిభచాటిన విద్యార్థులకై సర్టిఫికెట్లు అందచేస్తున్న దృశ్యం

**న్యాల్‌కల్, నవంబరు 27, ప్రభాతవార్త:**
మండలస్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్ టెస్ట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందచేసి అభినందించారు. మండలస్థాయి టెస్ట్‌లో సీనియర్ విభాగంలో మండలకేంద్రమైన న్యాల్‌కల్‌లోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యను ఆర్జిస్తున్న బి.వర్ష, జూనియర్‌స్థాయిలో మిర్జాపూర్ పాఠశాలలో విద్యను అందుకుంటున్న హాఫ్సాలు ఉత్తమప్రతిభ చాటారని ఉపాధ్యాయులు మొగులయ్య, రాము, ఈర్షద్, భాస్కర్‌నాయక్, ఉదయ్‌కుమార్ తదితరులు తెలిపారు.

## పంచాయతీ ఎన్నికలపై అధికారులకు శిక్షణ



ఎన్నికల అధికారులకు పంచాయతీ ఎన్నికలపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

**మనూర్, నవంబరు 27, ప్రభాతవార్త:**
పంచాయతీ ఎన్నికల నిర్వహణపై గురువారం ఎన్నికల అధికారులకు (రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు) మండలపరిషత్ కార్యాలయంలో శిక్షణ (అవగాహన) తరగతులు నిర్వహించినట్లు ఎంపిడిఓ చంద్రశేఖర్ తెలిపారు. డిసెంబరు 3వ తారీఖు నుంచి 5వ తేదీ వరకు ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నామినేషన్‌లను స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శెట్కార్ రాజశేఖర్, సూపరింటెండెంట్ వై.రఘుశేషు, శివకుమార్‌స్వామి, నారాయణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు శాస్త్రీయదృక్పథాన్ని అలవర్చుకోవాలి



జడ్పిహెచ్ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**చౌటకూరు, నవంబరు 27, ప్రభాతవార్త:**
విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్లు విఠల్‌నాయక్, శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని శివంపేటగ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో సంచార విజ్ఞాన ప్రయోగశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్, మ్యాథ్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులకు సంబంధించి శాస్త్రీయ ఆలోచనలను పెంచేదానిపై అవగాహన, పరిశీలన, ప్రయోగ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేదశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ, ఆలోచనలను పెంచుకుని వ్యక్తిత్వ సమాజ అభివృద్ధికి తోడ్పాడాలని సూచించారు. విద్యార్థులు పలు ప్రయోగాలను, మోడల్స్‌లను వీక్షించారు. కార్యక్రమంలో సైన్స్, మ్యాథ్స్, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు అబ్దుల్ ఖధీర్, శ్రీదేవి, శైలజ, వీరేశం, రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన నామినేషన్‌ల ప్రక్రియ

**-చిమ్నాపూర్ సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు**

**కంది, నవంబరు 27, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని చిమ్నాపూర్‌గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి మాజీ ఆత్మకమిటీ చైర్మన్ వడ్డేపల్లి కృష్ణగౌడ్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. చిమ్నాపూర్ పంచాయతీకి సంబంధించి సర్పంచ్ పదవికి కందిలోని రైతువేదికలో వడ్డేపల్లి కృష్ణ తన నామినేషన్‌ను ఎన్నికల అధికారులకు అందచేశారు.

## పత్తిసాగుతో అధిక దిగుబడి

**-సంగుపేట రైతువిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ**



చింతకుంటలో పత్తిపంటను పరిశీలిస్తున్న దృశ్యం

**జోగిపేట, నవంబరు 27, ప్రభాతవార్త:**
అధిక సాంద్రత పద్ధతిలో పత్తిని సాగు చేయటంద్వారా ఎక్కువ దిగుబడి సాధించవచ్చని సంగుపేట రైతువిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ తెలిపారు. గురువారంనా మండలపరిధిలోని చింతకుంటలో అధికసాంద్రత పద్ధతిలో సాగుచేసిన పత్తిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పద్ధతిలో పత్తి పంటను సాగు చేయటంద్వారా ఎకరాకు 22నుంచి 25వేల వరకు మొక్కలువస్తాయని తెలిపారు. దీనిద్వారా దిగుబడి అధికంగా వస్తుందన్నారు. తక్కువ పంటకాలం వల్ల ఒకేసారి పూతకాయలు రావటంతో పంట త్వరగా చేతికొస్తుందని పేర్కొన్నారు. దీనివల్ల గులాబిరంగు, కాయతొల్చుపురుగు బారినుంచి తప్పించుకొని నికర ఆదాయం పొందవచ్చని సూచించారు. అధికసాంద్రత పద్ధతిలో పత్తిపంట పూర్తవగానే రెండవపంటను విత్తుకోవచ్చని తెలిపారు. ఈ పద్ధతిలో పత్తి సాగుచేసిన రైతులు తమకు దిగుబడి అధికంగా వచ్చినట్లు స్వీయ అనుభవాల్ని వివరించారు. ఈకార్యక్రమంలో జోగిపేట వ్యవసాయశాఖ ఏడిఏ రమాదేవితోపాటు రైతులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సంఘం మండల నూతన కమిటీ

**నారాయణఖేడ్, నవంబరు 27, ప్రభాతవార్త:**
తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ నారాయణ ఖేడ్ మండలం నూతన కమిటీని స్థానిక కార్యాలయంలో ఈరోజు ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా రతన్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా కమ్మరి కిరణ్‌కుమార్, గౌరవ అధ్యక్షులుగా వడ్ల రాజయ్య, ఉపాధ్యక్షు లుగా నందప్ప, ప్రతాప్, కోశాధికారిగా యోగేశ్, మహిళా కార్యదర్శిగా మహాదేవి, చాప్ట కాంప్లెక్స్ కన్వీనర్‌గా అనంతపద్మనాభం, సంజీవన్ రావుపేట కాంప్లెక్స్ కన్వీనర్‌గా సుదర్శన్, నారాయణ ఖేడ్ క్యాంప్లెక్స్ కన్వీనర్‌గా జగదీశ్‌లను ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల పరిశీలకులు పెంటారెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ అధికారి సునార్ రమేశ్, అధ్యక్ష కార్యదర్శులు దత్తాత్రి, సుధాకర్, డివిజన్ అధ్యక్షులు చంద్రకాంత్, బాధ్యులు రామకృష్ణారెడ్డి, గంగారాం, మల్లికార్జున్, వినయ్, చంద్రకాంత్, చంద్రశేఖర్, లక్ష్మణ్, వివిధమండలాల బాధ్యులు, విష్ణు, మచ్చుందర్, రంజిత్, మహేశ్, కాశీనాథ్, అంజయ్య, రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలుచేయాలి

**-పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలి**



టేక్మాల్‌లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న దృశ్యం

**టేక్మాల్, నవంబరు 27, ప్రభాతవార్త:**
గ్రామ పంచాయతి ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్‌ను అనుసరిస్తూ మెదక్ జిల్లాలో తొలి విడత సర్పంచ్, వార్డు స్థానాలకు రిటర్నింగ్ అధికారులు గురువారం నోటిఫికేషన్‌లు జారీచేసి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారంచుట్టారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలుచేయాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం టేక్మాల్ మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయాలలో ఏర్పాటుచేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆకస్మికంగా సందర్శించి, అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. నామినేషన్ పత్రాల స్వీకరణకు చేసిన ఏర్పాట్లు గమనించి పలు సూచనలు చేశారు. హెల్ప్ డెస్క్, వీడియోగ్రఫీ, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరాతీశారు. నోటీసు బోర్డులపై నోటిఫికేషన్ నామినేషన్ పత్రాలను ప్రదర్శించారా అని తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలుతీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్‌లో నమోదుచేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్‌లను ఏరోజుకు ఆరోజు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తూ, జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్‌వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, నామపత్రాలు దాఖలుచేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ.తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, పై అధికారులను సంప్రతించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. ఎంపిడిఓ రియజోద్దీన్, తహసీల్దార్ తులసీరాంతో పాటు ఎన్నికల సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయనగర్ కాలనీలో 44 లక్షలతో సిసి రోడ్డు

**-పనులను ప్రారంభించిన కార్పొరేటర్ పుష్పనగేష్**



సిసి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, నవంబరు 27, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో 44లక్షల రూపాయల అంచనావ్యయంతో నిర్మించే సిసిరోడ్డు నిర్మాణానికి కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ గురువారం కాలనీ అధ్యక్షులు, కాలనీవాసులతో కలిసి భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భూమిపూజా కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ పుష్పనగేష్‌ను కాలనీవాసులు సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు అమృత్‌సాగర్, నరేంద్రబాబు, ప్రభాకర్ రెడ్డి, రాములు, ఉమాశంకర్, శ్రీధర్, బాలకిష్టయ్య, గళపకృష్ణ, వెంకట్ రావు, పూర్ణచందర్‌రావు, బసవరాజు, రవితేజ, అంజాద్‌ఖాన్, దస్తగిరి, కృష్ణరెడ్డి, ఎస్ఎస్ రెడ్డి, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్‌ను పునఃప్రారంభించిన బిజెపి నాయకులు




అంబులెన్స్ వాహనాన్ని పునఃప్రారంభిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, నవంబరు 27, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం వార్డులో అంబులెన్స్ అత్యవసర వాహనాన్ని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి ప్రోత్సాహంతో గురువారం పునఃప్రారంభించారు. కార్యక్రమానికి బిజెపి మండల అధ్యక్షుడు కావలి ఐలేష్, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు సారా సృజనలక్ష్మి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు అరవింద్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు నరసింహ, భాగయ్య, రాజు, స్వామి, పదాధికారుల కోఆర్డినేటర్ కవిత, అనిత, మండలనాయకులు, అశోక్, లక్ష్మీనారాయణ, కిషోర్ పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

**నాగల్‌గిద్ద, నవంబరు 27, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కరస్‌గుత్తి, డప్వూర్, గోప్యనాయక్ తండా, ఉట్పల్లి గ్రామాలకు చెందిన రామ్‌గొండ రాజ్‌కుమార్‌పాటిల్, గోవింద్ కుమార్తె, కుమ్మరి గుండప్ప కుమారుడికి గురువారం జరిగిన వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి కుటుంబాల సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు మాజీసర్పంచ్‌లు సుభాష్‌పటేల్, జనార్ధన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌లు శివరాజ్, రామచందర్‌పటేల్, నాయకులు మారుతి, సంజీవ్‌కుమార్, విఠల్ రెడ్డి, సంగప్ప, భీమన్న, దత్తు, హనుమారెడ్డి, సంజీవరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నరసింహారెడ్డి, అంజుగొండ, కార్తీక్, రాజు, నందు, నాగప్ప, డాక్టర్ విఠల్, శ్రీకృష్ణారెడ్డి, మారుతిరెడ్డి, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా మైత్రి ఫౌండేషన్

**గుమ్మడిదల, నవంబరు 27, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీపరిధికి చెందిన మైత్రి ఫౌండేషన్ సభ్యులు ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్నారు. హైదరాబాద్ సూరారానికి చెందిన సీసాల సరస్వతి రక్తహీనత సమస్యతో మల్లారెడ్డి హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా బి.పాజిటివ్ రక్తం అత్యవసరంగా అవసరమైంది అని కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న మైత్రి ఫౌండేషన్ సభ్యుడు నవీన్‌సాగర్ హాస్పిటల్‌కు చేరుకుని రక్తదానం చేసి సేవా భావాన్ని చాటుకున్నారు.

## పెద్దమఠాన్ని సందర్శించిన మెదక్ ఎంపి



పెద్ద మఠాన్ని పరిశీలిస్తున్న ఎంపి రఘునందన్‌రావు

**సదాశివపేట, నవంబరు 27, ప్రభాతవార్త:**
సదాశివపేట పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు గురువారం మెదక్ ఎంపి రఘునందన్‌రావు శంకుస్థాపనలు చేశారు. ఈక్రమంలో భాగంగా సదాశివపేటలోని పెద్దమఠాన్ని స్థానిక బిజెపి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు ఈమఠం చాలా పురాతనమైనందున శిథిలావస్థకు చేరుకొని కూలిపోతుందని, మరమ్మతులు చేపట్టి ఈమఠాన్ని బాగు చేయవలసి ఉందని, తమ సహకారం అవసరమని మఠం లింగానందస్వామి రఘునందన్‌రావు దృష్టికి తెచ్చారు. ఆయన స్పందిస్తూ తప్పకుండా చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం జగద్గురువులు విరూపాక్షానందస్వామి గదిని దర్శించారు. మఠంపక్షాన వారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో దేశ్పాండే ఓదెల మాణిక్యరావు, పిల్లోడి విశ్వనాథం, తోట చంద్రశేఖర్, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముగిసిన విగ్రహప్రతిష్ఠా మహోత్సవాలు



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న అరుణ్‌గురుస్వామి, ఎమ్మెల్యే

**నర్సాపూర్, నవంబరు 27, ప్రభాతవార్త:**
నర్సాపూర్‌పట్టణంలోని నర్సాపూర్-హైదరాబాద్ ప్రధాన జాతీయ రహదారి లోగల అటవీప్రాంతంలో నూతనంగా శ్రీఆదిపరాశక్తి అయ్యప్పస్వామి ఆలయాన్ని ఆలయకమిటీ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్, గురుస్వామి ఆధ్వర్యంలో నిర్మించారు. ఈ ఆలయంలో వేదపండితులు అరుణ్‌గురుస్వామి చేతులమీదుగా అయ్యప్పస్వామి విగ్రహప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిపించారు. అంతేగాక గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, ఆదిపరాశక్తి దేవతావిగ్రహాలతోపాటు భారీ ధ్వజస్తంభాన్ని అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. దీంతో ఈ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో మెదక్ ఎంపి రఘునందన్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు మురళియాదవ్, దుర్గాప్పగారి అశోక్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ రాజుయాదవ్, బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్‌దాస్ రాధామల్లేష్‌గౌడ్, అయ్యప్పదీక్షాస్వాములు పాల్గొనగా మాజీఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్పదీక్షాస్వాములు, భక్తులు, పట్టణప్రజలు అధికసంఖ్యలో హాజరై అయ్యప్పస్వామి కృపకు పాత్రులయ్యారు.

## ఆయిల్‌పామ్‌తో ఎక్కువ ఆదాయం

**వెల్దుర్తి, నవంబరు 27, ప్రభాతవార్త:**
గ్రామీణ ప్రాంత రైతులు ఆయిల్‌పామ్‌లతో తక్కువపెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చు అని వ్యవసాయ విస్తరణ అధికారి మజీద్, లీవ్‌పామ్ కంపెనీ ఆఫీసర్ నిశాంత్ అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని గంధం పోచమ్మ క్షేత్రంలో గురువారం ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆల్పాం సాగుకు సబ్సిడీ అందిస్తుందన్నారు. చీడపీడల బెడద తక్కువగా ఉంటుందన్నారు. 30ఏళ్ల వరకు ఆదాయం లభిస్తుందని వారు తెలిపారు. ఆల్పామ్ సాగుచేసి ఎస్సీ, ఎస్టీ రైతులకు డ్రిప్ సిస్టం 100శాతం సబ్సిడీ కాగా బిసిలకు 90శాతం, ఇతరులకు 80శాతం రాయితీ లభిస్తుందన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చని, అందుకు రైతులు ముందుకు వచ్చి ఆయిల్‌పామ్ సాగుకు మండలంలోని వ్యవసాయ అధికారులను సంప్రతించి సాగు చేసుకోవచ్చని, దీంతో ఆర్థికంగా బలపడవచ్చు అని వారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు మోహన్‌రెడ్డి. చిత్తరంజన్‌దాస్. రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఎంపి



ఎంపి ల్యార్డ్స్ పనులను ప్రారంభిస్తున్న ఎంపి రఘునందన్‌రావు

**సదాశివపేట, నవంబరు 27, ప్రభాతవార్త:**
సదాశివపేట పట్టణంలో వివిధ వార్డులలో ఎంపి లార్డ్స్ నిధులతో రోడ్డునిర్మాణ పనులను ప్రారంభించిన మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్‌రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఏ సమస్య అయినా పగలు, రాత్రి అని చూడకుండా నావద్దకు వస్తే పరిష్కారం చూపిస్తాను అని అన్నారు. 11వ వార్డులో రోడ్డు నిర్మాణం కొరకు 10లక్షల రూపాయల ఎంపి లార్డ్స్ నిధులతో నిర్మాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివాజీ, బిజెపి సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల మాణిక్‌రావు, మాజీ పట్టణ అధ్యక్షులు కె.శ్రీనివాస్, సీనియర్‌నాయకులు తోట చంద్రశేఖర్ పట్టణ ప్రధాన కార్యదర్శులు ఊషన్నగారి శ్రీశైలం, కావలి అనిత, పట్టణఉపాధ్యక్షులు కూర్చుని సతీష్ సంగమేశ్వర్, సాంబశివ, నవీన్‌కుమార్, విజయకుమార్‌యాదవ్, కార్యకర్తలు, పట్టణప్రజలు తదితరులు హాజరైనారు.

## గెస్ట్ లెక్చరర్‌కోసం దరఖాస్తు చేసుకోండి

**జోగిపేట, నవంబరు 27, ప్రభాతవార్త:**
జోగిపేట నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ సబ్జెక్టు బోధించేందుకు గెస్ట్‌లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పిజి చేసి ఉండి నెట్, సెట్, పిహెచ్‌డి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. దరఖాస్తులను డిసెంబరు 1వరకు కళాశాలలో అందచేయాలని తెలిపారు. డిసెంబర్ 2న సంగారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డెమోతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని ఆయన తెలిపారు.

## ఆశయసాధనలో విద్యార్థులు ముందుండాలి

**-ఆర్టీసీ డిప్యూటీ మేనేజర్ పి.శ్రీనివాసరావు**

**నారాయణఖేడ్, నవంబరు 27, ప్రభాతవార్త:**
విద్యార్థులు నిరంతరం విద్యాధ్యయనంచేసి తల్లిదండ్రుల ఆశయసాధనలో ముందుండాలని ఆర్టీసీ డిప్యూటీమేనేజర్ పి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం జడ్పిహెచ్ఎస్ నారాయణఖేడ్ పాఠశాలలోని విద్యార్థులకు యుఎస్‌లో ఉన్న తమ కూతురు బిందుసాహితి సంతోష్‌ల సహకారంతో 80మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు ఇతర విద్యాసామగ్రిని పంపిణీచేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మన్మథ కిషోర్, కుటుంబ సభ్యులు ఝాన్సీ లక్ష్మి, ఉపాధ్యాయులు యాదగిరి, హమీద్, చంద్రశేఖరాచార్య, ఆర్టీసీ సిబ్బంది భాస్కర్, శివకుమార్ పాల్గొన్నారు.

## మహాపడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే..

**నారాయణఖేడ్, నవంబరు 27, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి స్వగృహంలో కన్నెస్వామి డాక్టర్ పట్లోళ్ల అనురాగ్ రెడ్డి పడిపూజలో అయ్యప్పస్వాములు, గురుస్వాములు, భక్తులు నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు మహాపడిపూజలో పాల్గొని అయ్యప్పస్వామి ఆశీస్సులుపొందారు. అలాగే తీర్థప్రసాదాలు స్వీకరించారు. పట్లోళ్ల విట్టల్‌రెడ్డి, మాజీసర్పంచ్ పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి, పట్లోళ్ల లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతులను ఆదుకుంటున్న దళారులు

**సదాశివపేట, నవంబరు 27, ప్రభాతవార్త:**
లాభమో,నష్టమో ఏదో ఒకరకంగా మాపత్తిని దళారులు కొని మమ్మల్ని ఆదుకుంటున్నారని, వారే మాకు నిజమైన దేవుళ్ళని పలువురు రైతులు అంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో పత్తిని అమ్మి అధిక లాభాలు పొందండి అని, దళారులవద్దకు వెళ్లి నష్టపోకండి అని కొనుగోలు కేంద్రాలలో నాయకులుపెట్టే ఆంక్షలకంటే కొంత తక్కువధర అయినా దళారులే నయమని రైతులు అంటున్నారు. వారు తమ పత్తిని దళారులకు అమ్మనీయకుండా కొనుగోలుకేంద్రాలలో అమ్మేటట్టు చూడాలని తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య అధ్యక్షుడు పృథ్వీరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు.

## పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి



మొక్కలను తొలిగిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు

**నర్సాపూర్, నవంబరు 27, ప్రభాతవార్త:**
విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్‌ప్రిన్సిపల్ సమీరానజ్మీన్ అన్నారు. గురువారం స్వచ్ఛతాహి సేవ నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెద్ద చింతకుంటలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్‌ప్రిన్సిపల్ సమీరానజ్మీన్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా, 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని శ్రమదానంచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాలప్రాంగణంలో, తరగతి గదులు, చుట్టుపక్కల పెరిగిన ముళ్ళపొదలు, చెట్లపొదలను, ప్లాస్టిక్‌బాటిళ్లను, చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంచేశారు. కార్యక్రమం జాతీయ సేవాపథకం ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి.సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరగగా అధ్యాపకులు డాక్టర్ అనిత, డాక్టర్ రవికుమార్, హేమంత్‌లు వాలంటీర్లను ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శ్రీకాంత్, అజయ్, మేఘన, అఖిల, అశ్విని, స్ఫూర్తి తదితరులు పాల్గొన్నారు.

## దామరంచలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**వెల్దుర్తి, నవంబరు 27, ప్రభాతవార్త:**
స్థానిక ఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీలో చేరికలు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ టిపిసిసి కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని దామరంచ గ్రామానికి చెందిన వివిధపార్టీల నుండి నాయకులు కార్యకర్తలు 25మంది కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వెల్దుర్తి విట్టల్‌గౌడ్, సాయిగౌడ్, గుడిగ శంకర్, చంద్రం, శ్రీశైలం, పొట్టెం శివయ్య, నిరంజన్ గౌడ్, విట్టల్ ఎల్లం, సత్తిరెడ్డి, ఫక్రుద్దీన్, షేకులు, సత్తయ్య, సిద్ధిరాములుతోపాటు పలువురు నాయకులు టిపిసిసి కార్యదర్శి హల్లో రాజిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరగా, వారికి పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, మాజీఅధ్యక్షులు నరసింహారెడ్డి, వైసిపి సుధాకర్ గౌడ్. పూతరెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో భారీ చేరికలు

**-జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి**



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో తూంకుంట ఆంక్షరెడ్డి, నర్సారెడ్డి

**గజ్వేల్, నవంబరు 27, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ పార్టీలో బిఆర్ఎస్, బిజెపి పార్టీల నుండి నాయకులు, కార్యకర్తలు పెద్దయెత్తున చేరుతున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిలు పేర్కొన్నారు. గురువారం గజ్వేల్‌మండలం రిమ్మనగూడ గ్రామానికి చెందిన పలువురు బిఆర్ఎస్‌పార్టీ నాయకులు తూంకుంట ఆంక్షరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారికి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, ఏఎంసి డైరెక్టర్ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పడిపూజ

**పటాన్‌చెరు, నవంబరు 27, ప్రభాతవార్త:**
నేడు పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో 20వ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అయ్యప్ప స్వామి మాలదారులు, భక్తులు, ప్రజలు, భారీ సంఖ్యలో పూజా కార్యక్రమానికి హాజరై, స్వామి వారి కృపకు పాత్రులై, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అయ్యప్ప భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా కేటాయించిన పార్కింగ్ స్థలాల్లో వాహనాలు పార్కింగ్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.